# 'స్వధర్మో నిదానః'

ఓ చల్లని ఉదయం వేళ —

ఆ ఊరిలో కలకలం మొదలయ్యింది.

ఆ కలకలానికి కారణం ఊరి రాజకీయం కాదు. ఎప్పటినుంచో ఊరికి ఉన్న సమస్యలకి పరిష్కారం దొరికినట్లు కాదు. మరి కలకలానికి కారణం?

వెంకటరావు చేసిన పనికి. వెంకటరావు ఏం చేసాడంటే? వెంకటరావు ఏంచేశాడో తర్వాత తెలుసుకుందాము కాని, ఈ పనికి ఊరి పెద్దలు మాత్రం మద్దతు ప్రకటించలేదు సరికదా? వెలి వేద్దామని తీర్మానించారు. వెంకటరావు ఏం చేసాడంటే కులం కాని అమ్మాయిని పెళ్లి చేసుకున్నాడు. అదీ సంగతి. వెంకటరావు హోదా చూసి ఏరికోరి పిల్లనిస్తామని చుట్టుప్రక్కల గ్రామస్తులు తిరుగుచుంటుంటే వీడు ఈ పని ఎందుకు చేసాడో అనుకొని వాడ్ని పరామర్శిద్దామని వాడింటికెళ్ళాను.

ఇంట్లోకెళ్ళగానే "చానాళ్ళకి కన్పించావురా రాజూ" పలకరించాడు నా ముందుకి కుర్చీ జరుపుతూ వెంకటరావు.

"తీరుబడి దొరకక" సమాధానం చెప్పాను కుర్చీలో కూర్చుంటూ.

ఇంట్లోకి చూస్తూ "భవాని రెండు కప్పులు కాఫీ తీసుకురా" కేకపెట్టాడు వెంకటరావు.

కాఫీ తీసుకొచ్చిన అమ్మాయిని చూసి అలా ఉండిపోయాను. కారణం ఏమంటే? అమ్మాయి అందగత్తేమి కాదు. అలాగని అనాకారి మాత్రం కాదు. మరి ఈ అమ్మాయిని ఏమి కారణమో పెళ్ళి చేసుకోవడానికి ఆలోచిస్తుండగానే ఆమె లోపలికి వెళ్ళిపోయింది. నా సందేరాం గమనించినట్లు చిన్ననవ్వు నవ్వి వెంకటరావు "చూడు రాము, మనం ఏ విషయంలోనైన ఇతరుల సలహాలకి గౌరవం యిచ్చినా, ఇంట్లో పెద్దల మాటలు మన్నించినా వివాహం విషయంలో మాత్రము స్వంత నిర్ణయాలు తీసుకోవడం మంచిది. ఎందుకంటే దీంట్లో వచ్చే కష్టనష్టాలకు పూర్తి బాధ్యత మనదే అవుతుంది గాబట్టి."

నేను ప్రేమించిన అమ్మాయితో నేను ప్రేమింపబడ్డాను. నేను ఆర్థికంగా నా కాళ్ళ మీద నేను నిలబడ్డాను. అందుకే భవానిని పెళ్ళి చేసుకున్నాను. నాకు ఇష్టంలేని అమ్మాయితో పెళ్ళి జరిగితే నటించగలనేమో గాని, కలిసి కాపురం చెయ్యలేను. మరి నేను చేసింది సమంజసమే నంటావా?" గంభీరంగా అడిగాడు.

అప్పటికే ఒక నిర్ణయానికి వచ్చిన నేను "కాదు" అని చెప్పి భుజంతట్టి వడివడిగా రోడ్డు దారి పట్టాను.

— భీశెట్టి రామకృష్ణ.

---

# సహించలేక

తలవంచి తాళి కట్టించుకున్నావు  
తరతరాల సాంప్రదాయాల  
అడుగుజాడల్ని  
అనుసరించావు!  
కట్న కానుకలు తేలేక  
అత్తమామల ఆడబిడ్డల  
వెట్టి చాకిరి సాధింపులు,  
వేధింపులు!

సహించలేక!  
రూపాయి కిరసనాయిలు  
పావుల అగ్గిపెట్టితో  
నిండ నూరేళ్ళ జీవితాన్ని  
అంతం చేసుకున్నావు  
ఈ దేశంలో ఓ పిరికి,  
ఆడదానిలా నీవు!

'నవ్యశ్రీ'